www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 4 డిసెంబర్ 2023
5
చిత్తూరు

తిరుమలకు తుపాను ఎఫెక్ట్

తిరుమల: తిరుమల కొండపై మిచౌంగ్ తుపాను తీవ్ర ప్రభావం చూపుతోంది. గత రెండు రోజులుగా వర్షం, చలితో భక్తులు తల్లడిల్లిపోతున్నారు. గదులు నుంచి బయటకు రాలేక ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు చలి, మరోవైపు గాలి తీవ్రతకు నానిన చెట్లు ఎక్కడ పైన పడతాయని భయంతో బిక్కుబిక్కుమంటున్నారు. టిటిడి భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలి కోరింది. ఘాట్ రోడ్డులోని మలుపులు వద్ద పొగ మంచుతో వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయని, జాగ్రత్తగా వాహనాలు నడపాలని టిటిడి డ్రైవర్లకు సూచించింది.



ముంచుకొస్తున్న 'మిచౌంగ్'

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

తుపాను నేపథ్యంలో కురుస్తున్న వర్షాలతో నగరంలోని క్షేత్రస్థాయి పరిస్థితులను నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పరిశీలించారు. ఆదివారం ఉదయం వర్షంలోనే కమిషనర్ నగరపాలక పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలను, మేజర్ డ్రైనేజీలను తనిఖీ చేసి అధికారులకు మార్గనిర్దేశం చేశారు. మేజర్ డ్రైన్లు, కాలువల్లో నీటి ప్రవాహానికి ఆటంకాలు లేకుండా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించాలన్నారు. కార్మికులు తగిన జాగ్రత్తలు తీసుకొని పనులు చేయాలన్నారు. కొండారెడ్డిపల్లి, కుమార్ నగర్ కాలనీ, ఆర్టీసీ బస్టాండ్ రోడ్, బజార్ వీధి, ఇరువారం ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించి పరిస్థితిని పర్యవేక్షించారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో అత్యవసర స్పందన బృందాల ఏర్పాటు

తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరంలోని లోతట్టు, నీవానది పరివాహక ప్రాంతాల్లో నగరపాలక అధికారులు, యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని నగర కమిషనర్ అరుణ ఆదేశించారు. ప్రధానంగా నీవా నది పరివాహక ప్రాంతాలైన ఇరువారం, వీరభద్ర కాలనీ, ముత్యాలమ్మ గుడి, రిక్షాకాలనీ, వర్షపు నీటిప్రవాహాలు అధికంగా ఉండే ఇందిరానగర్, బాబాకాలనీ, శంకరయ్య కుంట, కుమార్ నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ తగినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇదే సమయంలో డ్రైనేజీ బ్లాక్ అయ్యేందుకు అవకాశం ఉన్న ఎమ్మెస్సార్ సర్కిల్, ప్రతి జంక్షన్, కట్టమంచి మార్కెట్ యార్డ్, కొండారెడ్డిపల్లి, ఓటికెరోడ్ తదితర ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించి నీరు నిల్వచేరకుండా చూడాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పనులు చేపట్టడానికి వీలుగా అత్యవసర బందాలను నియమించారు. వీరు వారికి కేటాయించిన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేయాలన్నారు. అత్యవసర స్పందన బందాలు 24/7 అప్రమత్తంగా ఉండాలన్నారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న నగర కమిషనర్ అరుణ

కార్యక్రమంలో ఎంహెచ్వో డా. లోకేష్, డీఈ రమణ, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, లోకనాథం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

చిత్తూరు అర్బన్: తుపాను నేపథ్యంలో ప్రజలన అప్రమత్తం చేయడంతో పాటు ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేలా రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామని చిత్తూరు తహశీల్దార్ మురళీమోహన్ తెలిపారు. ప్రజల సౌకర్యార్థం చిత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అత్యవసర సేవలకు ఫోన్ నెంబర్ 94910 77018, 98857 38918 కు సమాచారం ఇవ్వాలని కోరారు. సచివాలయం ఉద్యోగులు, వాలంటీర్లు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించిపై అధికారులకు సమాచారం తెలియజేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

నేలకొరిగిన వరి పంట

గంగవరం: వరి పంట కోయడానికి సిద్ధంగా ఉన్న సమయంలో గత పది రోజులుగా కురుస్తున్న జడివానతో పూర్తిగా నేలమట్టమయ్యిందని, చేతికొచ్చిన వంటను కళ్ల ఉండే నష్టపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు మండలంలో కేవలం 20 శాతం మంది రైతులు మాత్రమే వరి పంటను సాగు చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితిలో కొతకొచ్చిన పంట వర్షాల కారణంగా నేలమట్టం కావడంతో అప్పులు చేసిన పంటను నష్టపోయామని రైతు సుబ్రహ్మణ్యం ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.60వేలు పెట్టుబడి పెట్టిన పండించిన పంట చేతికందకుండా పోయిదని వాపోయాడు. అలాగే రైతు ఈశ్వర్ పండించిన ఎకరా వరి పంట పూర్తి నీటి మునిగికి వృధా అయ్యిందని ఎంతో ఆశతో పండించిన పంట నిరాశను, అప్పులను మిగిల్చిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

సంస్కరణల పేరుతో వినాశకర విధానాలు

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మొజు శ్రీనివాసరావు

సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మొజు శ్రీనివాసరావు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పాలకులు సంస్కరణల పేరుతో విద్యారంగంలో వినాశకర విధానాలు అమలు చేస్తున్నారని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మొజు శ్రీనివాసరావు ఆరోపించారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో జరిగిన యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈసందర్భంగా శ్రీనివాస రావు మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు పాలకులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. నూతన జాతీయ విద్యావిధానం అమలు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 117 వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది పాఠశాలలో మూసివేతకు గురయ్యాయని, 11వేల ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగ నిర్వహణ బాధ్యతల నుండి తప్పుకునేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, అందులో భాగంగానే ఉపాధ్యాయుల ఏ ఒక్క సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. జూన్ మాసంలో ఉపాధ్యాయ బదిలీలు జరిగాయని, అప్పటినుండి క్యాడర్ స్ట్రెంత్ ఆప్డేషన్ పేరుతో 250మంది ఉపాధ్యాయులకు ఐదు మాసాలుగా జీతాల చెల్లింపులు లేవన్నారు. డిసెంబర్ 9,10 తేదీలలో ఏలూరు జిల్లాలో యుటిఎఫ్ 49వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు జరగనున్నాయని ఈ సమావేశాలలో విద్యారంగంలో పాలకులు చేపట్టిన సంస్కరణలపై చర్చిస్తామన్నారు. అలాగే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల హామీగా ఇచ్చిన సిపిఎస్ రద్దు, పాత పెన్షన్ అమలు విధానంపై మాట తప్పి జిపిఎస్ విధానాన్ని అమలు చేయడం పట్ల ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పాత పెన్షన్ అమలు కోసం కౌన్సిల్ సమావేశాల్లో పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ధ్యేయంగా కార్యాచరణ రూపొందించి పోరుబాటుకు పిలుపునిస్తామని ఆయన తెలిపారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా స్వర్ణోత్సవ వేడుకలను ప్రారంభించామని అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించడంతోపాటు సామాజిక అభివద్ధి కార్యక్రమాలు చేపడతామని ఆయన పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయేంద్రరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, అధికారులు అందరూ కలిసి సమిష్టి కృషి చేసి మంచి అభివద్ధి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.రఘుపతి రెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సోమశేఖర నాయుడు, జీవి.రమణ, గౌరవాధ్యక్షులు సుధాకర రెడ్డి, సహధ్యక్షులు పిఆర్.మునిరత్నం, రెహానా బేగం, కోశాధికారి ప్రసన్న కుమార్, నాయకులు జగన్మోహన్‌రెడ్డి, కష్ణమూర్తి, రెడ్డప్ప నాయుడు, గాలి సురేష్ , దక్షిణా మూర్తి, ఎస్‌పి బాషా, దీనావతి, సిపి ప్రకాష్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర, ఉపాధ్యక్షులు వాడ గంగరాజు పాల్గొన్నారు.

4న గ్రీవెన్స్‌డే రద్దు: కలెక్టర్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

4వ తేదీ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించే గ్రీవెన్స్ డే రద్దును 'మిచౌంగ్' తుపాను కారణంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అర్జీదారులు గమనించి సమస్యల పరిష్కారం కొరకు జిల్లా కేంద్రంకు వ్యయ ప్రయాసలకు ఓర్చి రావద్దని కలెక్టర్ పేర్కొన్నారు.

తుపాను ప్రభావం నుంచిపంటను కాపాడుకుందాం

వ్యవసాయశాఖ జేడి మురళీకృష్ణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

తుపాను ప్రభావం నుండి పంటను కాపాడుకొనేందుకు రైతులు వ్యవసాయశాఖ సూచనల మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ జేడి మురళీకృష్ణ ఆదివారం సూచించారు. వరి పంట గింజ గట్టిబడి కోతకు సిద్ధంగా ఉన్న వరిలో సత్వరమే కంబైన్డ్ హార్వెస్టర్ ఉపయోగించి, వచ్చిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతంలో వర్షంకు తడవకుండా ఆరబెట్టుకోవడం, తగినన్ని టార్పలిన్, పాలిథిన్ పట్టాలను పూర్తి స్థాయిలో అందుబాటులో పెట్టుకోవడం, తుపాను వెలిసిన తరువాత ఆ ధాన్యంను ఆరబెట్టుకునే విధంగా ఉండటం చేయవలసి ఉంటుందన్నారు. వరి పంట కోసి పనలు చేనులో వుండే పరిస్థితులలో తక్షణమే పనలను కట్టలుకట్టి గూడు, కుప్పలు పోసి పంటను వర్షంలు నుండి తడవకుండా చూడటం, తడిసిన పనలలో మొలకలు రాకుండ 5శాతం ఉప్పు ద్రావణం పిచికారీపై ముందస్తుగా దిగువశ్రేణి క్షేత్ర సహాయకులు అవగాహన కల్పించాలని అన్నారు. అదేవిధంగా మెట్ట పంటలైన ఖరీఫ్ పత్తి, మిరప పంటల చేనులలో వర్షపునీరు నిలవ కుండా వర్షపు నీరు వేగంగా సులభంగా కొట్టుకు పోయే విధంగా చేలగట్లలో ఎక్కువ సంక్యలో వాలుకూ నిలువుగా గండ్లు చేయాలన్నారు. జిల్లాలకు సంబంధించిన కెవికె, వ్యవసాయ శాస్త్రవేత్తలతో సమన్వయం చేసుకుంటూ రైతులకు ఎటువంటి నష్టం జరగకుండాతోడ్పడాలని కోరారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

తగిన జాత్రలు తీసుకోవాలి

డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంటి చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇంట్లో, ఇంటి చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. చిన్నపాటి జర్వం వచ్చినా సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. వర్షాకాలంలో డెంగీ, మలేరియా, టైపాయిడ్, చికన్ గున్యా వంటి జర్వాలు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయి. ముఖ్యంగా దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాచ్చి వడపోసిన నీటిని తాగడం మంచిది. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

సీజనల్ వ్యాధులపై జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగిందని, ప్రజల్లో సీజన్ వ్యాధులపట్ల అవగాహన కల్పిస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ప్రభావతిదేవి తెలిపారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరముందని, ఇంటి పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడంతో పాటు దోమలు కుట్టకుండా దోమ తెరలను ఉపయోగించాలని ఆయన తెలిపారు. అలాగే ప్రతి శుక్రవారం ఫైడే డ్రైడే పేరుతో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తమ పరిధిలోని ప్రాంతాల్లోని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజాశక్తి ప్రత్యేక ఇంటర్వ్యూలో వర్షకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను డాక్టర్ ప్రభావతిదేవి వివరించారు.

ప్రజాశక్తి: జిల్లాలో తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తున్నాయి, సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎం అండ్ హెచ్ఒ: సీజనల్ వ్యాధుల పట్ల వర్షకాలం, వేసవి కాలం అని తేడా లేకుండా వైద్యఆరోగ్యశాఖలో పనిచేస్తున్న సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతోంది. ముఖ్యంగా ప్రతి శుక్రవారం వైద్య ఆరగ్యోశాఖ సిబ్బంది తమ పరిధిలోని ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాలపై అధికారులు తనిఖీ చేయడం జరుగుతోంది.

\- డాక్టర్ ప్రభావతిదేవి

జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి

ప్రజాశక్తి: వర్షాల నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డిఎం అండ్ హెచ్ఒ: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఆశా, ఏఎన్ఎంలు తమ పరిధిలోకి వచ్చే ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తున్నారు, తీవ్ర జ్వరం డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు కనిపిస్తే వెంటనే రేఫర్ చేయాలని ఆదేశించడం జరిగింది. రెండు రోజులకు మించి జ్వరం ఉంటే రక్తపరీక్షలు చేయిస్తున్నాం.

ప్రజాశక్తి : చిత్తూరు జిల్లాలో వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆసుపత్రులు ఎన్ని?

డిఎం అండ్ హెచ్ఒ: వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో 24 ఆసుపత్రలు, 2 ప్రధాన వైద్యశాలలు, 5 ప్రాంతీయ వైద్యశాలతో పాటు 19 సామాజిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 1,700 పడకలున్నాయి. వీటిలో 899 మంది సిబ్బంది పని చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపి సేవలు పెరిగాయి. ఎక్స్‌రే, యు.యుస్.జి, ఇసిజి, ల్యాబ్ టెస్ట్‌లు అందిస్తున్నాం.

ప్రజాశక్తి: డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సేవలు ఎంతమందికి అందించారు?

డిఎం అండ్ హెచ్ఒ: డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా జిల్లాలో 3,561 మంది చికిత్సలు సేవలు పొందారు. తల్లిబిడ్డ సంరక్షణ కింద సాధారణ ప్రసవాలు 4,986 సిజేరియన్ ప్రసవాలు, వైఎస్ఆర్ కంటి వెలుగు కింద ఎపివివిపి ఆసుపత్రుల కంటి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు చేసి కంటి అద్దాలు, చిత్తూరు, మదనపల్లి, పలమనేరు, కుప్పం, ఆసుపత్రుల్లో సర్జరీ కంటి పరీక్షలు చేస్తున్నాం.

ప్రజాశక్తి: నేషనల్ ఫ్రీ డయాలసిస్ సెంటర్ ద్వారా అందించే సేవలు ఏమిటి?

డిఎం అండ్ హెచ్ఒ: నేషనల్ ఫ్రీ డయాలసిస్ సెంటర్ 2016లో శ్రీకాళహస్తి, కుప్పంతోపాటు చిత్తూరు, మదనపల్లిలో ప్రారంభించడం జరిగింది. కిడ్నీ వ్యాధితో బాధపడేవారు నెల్లూరు, తిరుపతి వెళ్ళేవారు. ప్రస్తుతం ఉచితంగా కిడ్నీ డయాలసిస్ చేస్తున్నారు. 38 మిషన్లున్నాయి. జనరల్ కేసులకు 1 డ్యూటీ మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఉంటారు. నెలలో 15 రోజులకు ఒకసారి నెఫ్రాలజిస్ట్ స్పెషలిస్ట్ వచ్చి పరీక్షిస్తున్నారు. 2021-22లో 328 మందికి వ్యాధి నిర్ధారించి చికిత్స అందిస్తున్నాం.

ప్రజాశక్తి: మత్తుపదార్థల నివారణ కేంద్రాలెన్ని ఉన్నాయి, వాటి ద్వారా అందిస్తున్న సేవలేమిటి?

డిఎం అండ్ హెచ్ఒ: జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి చిత్తూరు, మదనపల్లి నందు మత్తుపదార్థలకు బానిసలుగా మారిన వారికి సేవలు అందించడం జరుగుతోంది. 2021-22లో 2,355 పైగా ఓపీడి, 74 ఐపిడి కేసులు, ఈ ఏడాదిలో 459 ఓపిడి, 9 ఐపిడి కేసులు చిత్తూరు ఆసుపత్రిలో వైద్యసేవలు పొందారు. మదనపల్లిలో కూడా ఓపిడి, ఐపిడి కేసులకు వైద్యసేవలు అందిస్తున్నాం.

ప్రజాశక్తి: సదరం కార్యక్రమం ఎలా నడుస్తోంది?

డిఎం అండ్ హెచ్ఒ: సదరం కార్యక్రమం ద్వారా విభిన్న ప్రతిభావంతులకు సర్టిఫికెట్లు జారీచేయడం జరుగుతోంది. 13 ఆసుపత్రుల్లో విభిన్న ప్రతిభావంతులైన వారికి 2018 నుండి ఇప్పటి వరకు 17,942 మందికి పరీక్షలు నిర్వహించి సర్టిఫికేట్లు జారీ చేశాం. అలాగే నాడు- నేడు పథకం ద్వారా జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికరించే పనులు వేగవంతంగా నిర్వహించడం జరుగుతోంది.

\- డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి

వణికిస్తున్న మిచౌంగ్

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- ఏర్పేడులో గోడకూలి బాలుడు మృతి
- తొట్టంబేడులో నీటి మునిగిన వరి పంటలు
- పొంగి పొర్లిన వాగులు, వంకలు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- దొరవారిసత్రంలో 141.8 మి.మి వర్షపాతం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

మిచౌంగ్ తుపాను తూర్పు మండలాలను వణికిస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత రెండు రోజులుగా తూర్పు మండలాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాల ధాటికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్న పరిస్థితి నెలకొంది. శ్రీకాళహస్తిలో అత్యధికంగా 128.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. భారీ వర్షానికి పూరింటి గోడ కూలి తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం చిందేపల్లి యానాది కాలనీలో ఆదివారం తెల్లవారుజామున నాలుగేళ్ల బాలుడు యశ్వంత్ దుర్మరణం చెందాడు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి, ఏర్పేడు, కేవిబిపురం, బుచ్చినాయుడు కండ్రిగ, పెళ్లకూరు, నాయుడుపేట మండలాల్లో పది వేల ఎకరాల్లో వరి పంటలు నీట మునిగాయి. వరద నీటి ఉధతికి చాలా గ్రామాల్లో కాజ్ వేల పైకి నీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. కెవీబీపురం మండలం కోవనూరు సమీపంలో శ్రీకాళహస్తి- పిచ్చాటూరు మార్గంలో ఉన్న వాగు ప్రమాద స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అవతల వైపు ఉన్న సుమారు 40గ్రామాలకు శ్రీకాళహస్తి పట్టణంతో సంబంధాలు తెగిపోయాయి. అదేవిధంగా శ్రీకాళహస్తి- కాళంగి మార్గంలో ఉన్న చిట్టత్తూరు వాగు ప్రమాదస్థాయిని దాటి ప్రవహిస్తుండడంతో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను నిలిపేశారు. దీంతో అవతలి వైపు ఉన్న సుమారు 20 గ్రామాల ప్రజలకు శ్రీకాళహస్తి పట్టణంతో సంబంధాలు తెగిపోవడంతో అత్యవసర వైద్యానికి, నిత్యావసర సరుకులకు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా కారాకొల్లు, చోడవరం వాగులు వరద నీటి ఉధతితో ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో అక్కడా అదే పరిస్థితి నెలకొంది. ప్రమాదకర వాగుల వద్ద రెవెన్యూ, పోలీస్ అధికారులు భద్రతను ఏర్పాటు చేసి వాగుల వద్ద ఎవరూ ప్రయాణాలు చేయకుండా ఆంక్షలు విధించారు. మిచౌంగ్ తుపాను ధాటికి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జలాశయాలకు, చెరువులకు క్రమంగా భారీగా నీరు చేరుకుంటోంది. మరో రెండు రోజులపాటు తుఫాను ప్రభావం ఉన్న నేపథ్యంలో భారీగా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి. ఈ క్రమంలో 80 శాతం మేర నిండిన చెరువులు కురిసే వర్షాలకు నీటి నిల్వలు ప్రమాదకరస్థాయికి చేరి గండ్లు పడే అవకాశాలు ఉన్నాయంటూ ఇరిగేషన్ అధికారులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. తరచూ గండ్లు పడే చెరువుల వద్దకు వెళ్లి ఇరిగేషన్ అధికారులు పరిశీలిస్తున్నారు. అప్రమత్తంగా ఉండాలంటూ రైతులను సమాయత్తం చేస్తున్నారు.

జలాశయాలకు జలకళ..

కరువు తప్పదనుకున్న తరుణంలో మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో జలాశయాలు క్రమంగా జలకళను సంతరించుకుంటున్నాయి. కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్‌కు వరద నీటి తాకిడి పెరగడంతో అధికారులు ఐదు గేట్లను ఎత్తివేసి 4200 క్యూసెక్కుల నీటిని బయటకు వదులుతున్నారు. అదేవిధంగా మల్లిమడుగు రిజర్వాయర్ కూడా భారీగా వరద నీరు చేరుతుండడంతో నీటిని బయటకు వదిలేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పరవళ్లు తొక్కుతున్న స్వర్ణమ్మ

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డున ప్రవహించే స్వర్ణముఖి నది పరవళ్లు తొక్కుతోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తూర్పు మండలాల్లో భారీ వర్షం కురుస్తోంది. ఈ వర్షంతో వరద నీరు స్వర్ణముఖి నదిలోకి భారీగా చేరుతోంది. ఇక చంద్రగిరి, తిరుపతి, రేణిగుంట, ఏర్పేడు, శ్రీకాళహస్తి ప్రాంతాల నుంచి స్వర్ణముఖి నది లోనికి వర్షపు నీరు వస్తోంది. ఇలా వర్షపు నీరు భారీగా వస్తుండటంతో స్వర్ణమ్మ నిండుకుండలా సముద్రపు వైపు పరుగులు తీస్తోంది. ముఖ్యంగా శ్రీకాళహస్తీశ్వర ఆలయ సమీపంలో స్వర్ణమ్మ ఇరగట్లను తాకుతూ జోరుగా ప్రవహిస్తుండటంతో ముక్కంటి భక్తులతో పాటు శ్రీకాళహస్తి వాసులకు కనువిందు చేస్తోంది.

జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధం : కలెక్టర్

తిరుపతి టౌన్: మిచౌంగ్ తుపాను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సన్నద్ధంగా ఉందని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి తెలిపారు. సచివాలయ, గ్రామ, మండల, మునిసిపల్ స్థాయిలోని అధికారులందరూ పనిచేసే చోటే అందుబాటులో ఉండాలి కలెక్టర్ సూచించారు. జిల్లా యంత్రాంగం అంతా అప్రమత్తంగా ఉండాలి, నిర్లక్ష్యం తగదు పేర్కొన్నారు. ప్రజలందరూ అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దు అని, ఇళ్లల్లోనే సురక్షితంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. పాత మట్టి మిద్దెలు, పూరి గుడిసెలలోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలింపుకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. పదిరోజుల్లో ప్రసవం కానున్న గర్భిణులను ముందుగానే ఆసుపత్రులకు తరలించడం కొరకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా ఇళ్లలోకి నీరు ప్రవేశిస్తే ఆ కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రధాన చెరువుల వద్ద పర్యవేక్షణకు అధికారులను నియమించడం జరిగిందని, ప్రమాదకరంగా నీరు ప్రవహించే కల్వర్టుల వద్ద వాహనాల రాకపోకలను నియంత్రించాలి కోరారు. రెవెన్యూ డివిజన్లలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నంబర్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీకాళహస్తి- 97041 61120, సూళ్లూరుపేట 94907 39223, గూడూరు 08624 252807, తిరుపతి 94910 77012.

తిరుపతి టౌన్: తిరుపతి జిల్లాలో ఆదివారం ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. జిల్లాలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయ్యాయి. తిరుపతి జిల్లాలో అత్యధికంగా దొరవారిసత్రంలో అత్యధికంగా 141.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయ్యింది. తిరుపతి జిల్లాలో మిచౌంగ్ తుఫాన్ ప్రభావం వల్ల దొరవారి సత్రం మండలంలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 141.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయినట్లు జిల్లా గణాంకల అధికారి పేర్కొన్నారు. పెళ్లకూరు మండలం 133. 0, వాకాడు 112.2, బిఎన్ కండ్రిగ 108.8, చిట్టమూరు 99.6, నాయుడుపేట 95.6, కేవిబి పురం 95.2, వరదయ్యపాలెం 86.4, తడ 76.4, కోట 74.0, సూళ్లూరుపేట 70.6, శ్రీకాళహస్తి 62.8, నారాయణవనం 60.6, ఓజిలి 60.4, తొట్టంబేడు 60.0, వడమాలపేట 53.2, పుత్తూరు 53.2, సత్యవేడు 44.6, ఏర్పేడు 40.0, రేణిగుంట 38.0, పిచ్చాటూరు 37.2, గూడూరు 36.4, రామచంద్రపురం 35.4, తిరుపతి రూరల్ 30.4, చిల్లకూరు 29.8, దక్కిలి 28.8, బాలయ్యపల్లి 28.4, నాగలాపురం 27.4, వెంకటగిరి 26.4, తిరుపతి అర్బన్ 19.4, చంద్రగిరి 17.0, ఎర్రవారిపాలెం 10.2, పాకాల 8.8, చిన్నగొట్టికల్లు 8.0 వర్షపాతం నమోదు కాగా తిరుపతి జిల్లా మొత్తం 1909.2 వర్షపాతం నమోదైనట్లు పేర్కొన్నారు.

చెరువులను పరిశీలించిన జేసి

తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్ డికె.బాలాజీ ఆదివారం చిల్లకూరు, కోట, వాకాడు, గ్రామాలల్లోని చెరువులను పరిశీలించారు. అలాగే రేషన్ పంపిణీ పరిశీలించారు. తుపాను దృష్ట్యా ఎక్కడా రేషన్ పంపిణీ ఆపడానికి లేదని, తహశీల్దార్లు అందరూ రేషన్ పంపిణీ సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులు ఆదేశించారు.

ఓటు.. పౌరులందరి హక్కు

- కమిషనర్ అరుణ

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పౌరులందరూ ఓటరుగా నమోదు కావాలని చిత్తూరు నగర కమిషనర్ డాక్టర్ అరుణ అన్నారు. ఆదివారం పోలింగ్ కేంద్రాలు వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపులను పరిశీలించారు. ఇరువారం పరిధిలోని 111, 112 పోలింగ్ కేంద్రంలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతన ఓటరు దరఖాస్తులు, సవరణలు, ఓట్లు తొలగింపునకు వచ్చిన దరఖాస్తులకు సంబంధించి వివరాలను ఆరాదీశారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రికార్డులు పక్కాగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఫారం-7 విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం అనుబంధ దస్త్రాలు, సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్ అధికారి, ఎంహెచ్వో డాక్టర్ లోకేష్, బిఎల్వోలు పాల్గొన్నారు.

ఓటు ఉన్నట్టా.. ఊడినట్టా..

ప్రజాశక్తి-గుడుపల్లి: ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నాయకులు ఓటరు జాబితా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ ఓట్లు ఉన్నాయా.. తొలగించారా.. తప్పులు ఉన్నాయా.. అనే విషయంగా అయోమయం వ్యక్తం చేశారు. కాగా ఆదివారం గుడుపల్లి మండలం అగరం పంచాయతీ క్లస్టర్ ఇంచార్జ్ హేమాంబాగౌడ్ ఆధ్వర్యంలో ఓటరు లిస్టును పరిశీలించారు. పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్వోలను సందేహాలను అడిగి తెలుసుకున్నారు. పారదర్శకంగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జ్ ప్రకాష్, మాజీ సర్పంచ్ వెంకటాచలం, టీడీపీ పంచాయతీ అధ్యక్షులు చంద్ర పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాల పరిశీలన

ప్రజాశక్తి -రేణిగుంట : మిచౌంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షా లకు పట్టణంలో వాగులు వంకలు పొంగి పొర్లు తున్నాయి. ఆదివారం తుపాన్ ప్రభా వం వల్ల కురిసిన భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుండి వర్షపు నీరు ఇళ్లలోకి దూసు కొచ్చాయి. అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పట్టణంలో వర్షపు నీటితో వీధులు, రోడ్లు జలమయ మయ్యాయి. కరెంట్ స్తంభాలు కూలిపోయి విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. భగత్ సింగ్ కాలనీ వద్ద వంక ఉధృతంగా ప్రవహించి ఆ ప్రాంతం జలమయం అయింది. రేణిగుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ నగేశం తెల్లవారుజాము నుంచి పంచాయతీ పరిధిలో సుడిగాలి పర్యటనలు చేస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూ జెసిబి సాయంతో యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపట్టారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సైనికుడిలా సర్పంచ్ సేవలందిస్తున్నారు. సర్పంచ్‌తో పాటు వైసిపి ముస్లిం నాయకులు షబ్బీర్ అహ్మద్, వార్డు మెంబరు ఈశ్వరి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తెగిపడి గేదె మృతి

ప్రజాశక్తి- వరదయ్యపాలెం తుపాను ప్రభావంతో నిర్విరామంగా కురుస్తున్న వర్షాలు, ఈదురు గాలులు కారణంగా ఆదివారం విద్యుత్ వైర్లు తెగిపడి గేదె మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. పెద్ద పాండూరుకు చెందిన షేక్ మాబు కుటుంబం, గేదెలపై ఆధారపడి పాలను విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. తుపాన్ ప్రభావంతో ఈదురు గాలులు , భారీ వర్షాల కారణంగా విద్యుత్ వైర్లు తెగిపడి గేదె మృత్యువాత పడింది. ఎంతో కష్టపడి రూ.70 వేలు వెచ్చించి, గేదెను కొనుగోలు చేశామని, తమకు జీవనాధారం లేకుండా పోయిందని బాధిత మహిళా పాడిరైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ వైర్లకు శాశ్వత మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి- కెవిబిపురం: శ్రీకాళహస్తి -పిచ్చాటూరు రోడ్డు మార్గంలో కెవిబి పురం మండలంలోని కోవనూరు సమీ పంలో కాజు వేపై ఉధృతంగా నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవు తున్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా తహశీల్దారు శ్రీదేవి ఆదేశాల మేరకు వర్షం సైతం లెక్కచేయకుండా ఏఎస్ఓ మల్లి కోవనూరు కాజు వే నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. ఈ మార్గంలో ఎవరూ వెళ్లకూడదని ప్రయాణికులకు సూచించారు. అనంతరం అంజూరు చెరువు ప్రమాదకర స్థితిలో ఉండడంతో ఆ చెరువును పరిశీలించి గ్రామస్తులులకు సూచనలు ఇచ్చి నిండిన చెరువు కలుజు తీయించారు. కలుజు ఉధృతంగా ప్రవహిస్తోందని ఎవరూ వెళ్లకూడదని తెలిపారు. కాళంగి రిజర్వాయర్ ను పరిశీలించి సంబంధిత ఏ ఈ తో మాట్లాడి నీటి శాతం ఎంత చేరింది? కనుక్కొని ప్రమాద కరమైన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తహశీల్దారుకు తెలపాలన్నారు. గ్రామస్తులతో మాట్లాడి కాళంగి రిజర్వాయర్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

బాలుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం చిందేపల్లి ఎస్టి కాలనీలో భారీ వర్షాలకు గోడ కూలి నాలుగు సంవత్సరాల యశ్వంత్ మృతి చెందాడు. అని మృతితో ప్రగతి డైరెక్టర్ కెవి రమణ ఆ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రెండువేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ వర్షాలు ఎక్కువగా ఉన్నందువలన ప్రజలందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన షెల్టరులో బస చేసిన వారికి ప్రభుత్వమే భోజన సదుపాయాన్ని కూడా అందజేస్తుందని తెలిపారు. గృహాలు దెబ్బతిన్న వారికి ప్రభుత్వం ద్వారా పక్క గృహాలు నిర్మించాలని ఆధార్ కార్డు, రేషన్ కార్డు లేని వారికి వాటిని అందించుటకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సిబ్బంది, వీఆర్వో, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్పందించిన గ్రామ సర్పంచ్.. మురుగునీరు తొలగింపు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలంలో ప్రస్తుతం రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఎస్ బి ఆర్ పురం గ్రామపంచాయతీ లోని ఆదిఆంధ్ర వాడ వీధులు బురదమయం అయింది. వీధు లలో మురుగునీరు ప్రవహి స్తోంది. మురుగు కాలవలు సక్రమంగా లేకపోవడం వల్ల వర్షపు నీరు వీధులలో, ఇళ్లలోకి చేరి వీధులు జల మయం అయ్యాయి. వర్షపు నీరు వీధులలో చేరి వెలుపలకు వెళ్లకుండా వీధులు వర్షపు నీటితో నిండిపోయాయి. దీంతో గ్రామస్తులకు అసౌకర్యం ఏర్పడింది. ఆది ఆంధ్రవాడ గ్రామస్తులు చాలాసార్లు గ్రామ పంచాయతీ సిబ్బంది అధికారులకు చెప్పినా ఏ మాత్రం పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. దీనిపై స్పందించిన గ్రామ సర్పంచ్ మణి రాజు ఆదిఆంధ్రవాడలో ఆదివారం పర్యటించి వర్షపు నీరును బయటకు వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. జేసీబీతో శుభ్రం చేశారు. దీంతో ఆది ఆంధ్రవాడ కాలనీ వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

మండల అభివృద్ధి బాగుంది

ఎంపీపీకి మంత్రి కితాబు

ప్రజాశక్తి-కార్వేటినగరం: నియోజకవర్గంలోని కార్వేటినగరం మండల అభివృద్ధి బాగుందని ఎంపీపీ లతబాలాజీకి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కితాబు. ఆదివారం నారాయణవనంలోని ఓ కార్యక్రమానికి కార్వేటినగరం మీదుగా మంత్రి వెళ్లారు. ఈ సందర్భంగా ఎంపీపీని పలకరించారు. బాలాజీ తండ్రి శ్రీరాములునాయుడు ఆశయాలకు తగ్గట్టుగా పనిచేస్తున్నారని అభినందించారు.

ఆట వస్తువులు పంపిణీ

ప్రజాశక్తి-గంగవరం: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆట వస్తువులను జాయినింగ్ ది డాట్స్ ఫౌండేషన్ తరపున అందజేశారు. గంగవరంలోని ఐఈఆర్‌టీ పాఠశాలలో ఎంఈవో చేతుల మీదుగా ఈ వస్తువులను అందజేశారు. కార్యక్రమంలో వలంటీర్ విజయ్, ఉపాధ్యాయులు రూ. దేవేంద్ర, అశోక్, రాజన్న, గాయత్రి, సురేఖ, తిలోక్, రమణ పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు మాట్లాడుతూ కుప్పం పీఈఎస్ ఆసుపత్రి సహకారంతో క్యాంపు నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిబిరంలో 70మంది పరీక్షలు చేయించుకోగా 8మందికి ఆపరేషన్ చేయాల్సి ఉందన్నారు. మహతి ఫౌండేషన్ సిబ్బంది శ్రీనివాసులు, వైద్య బృందం పాల్గొన్నారు.

జీవరత్నమ్మ మృతికి టిడిపి నాయకుల సంతాపం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మున్సిపాల్టీ 4వ వార్డుకు చెందిన టిడిపి కార్యకర్త జనార్దన్ ఆచారి భార్య జీవరత్నమ్మ మృతి పట్ల పుత్తూరు పట్టణ టిడిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతిక దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంతా పం తెలిపిన వారిలో పుత్తూరు పట్టణ టిడిపి అధ్యక్షులు జి జీవ రత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, పుత్తూరు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఏ.ఆనంద్, 4వ వార్డు కౌన్సిలర్ కేశవాచారి, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు.

జాగ్రత్తతో విద్యుత్ ప్రమాదాలు నివారించాలి

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: తుపాన్ వల్ల కురిసే వర్షాలు, గాలులు, వల్ల రైతులకు సంబంధించిన కొందరి కరెంట్ మోటార్లు వర్షపు నీటిలో మునిగి వుంటాయని, స్టార్టర్స్, డబ్బాలు తడిసి వుంటాయని సర్వీసెస్ వైర్స్ డామేజి అవుతాయని, స్తంభాలు పడిపోవచ్చని, వైర్స్ తెగిపోవచ్చని వాటిని ముట్టుకొనే ప్రయత్నం చేయొద్దని విద్యుత్ శాఖ అధికారి పుణ్యకోటి పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వైర్ల దగ్గరకు వెళ్లే ప్రయత్నం కాని చేయొద్దని ఆక్వా రైతులు, ఏరియేటర్స్‌ను ముట్టుకుంటే విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం వుందని మీ ఇంటికి సంబంధించిన సర్వీస్ వైర్లని కాని, వాటితో వెలాడే ఇనుప తీగలను కానీ, కరెంట్ స్తంభాలను కానీ, ఇనుప స్తంభాలను కానీ, లైన్స్ మీద చెట్టు కొమ్మలు పడినా వాటిని ముట్టుకునే ప్రయత్నం చేయొద్దన్నారు. ఇంట్లో నుండి బయటకు వచ్చేటప్పుడు జాగ్రత్తగా వుండాలని, వాహనాలలో వెళ్లేటప్పుడు జాగ్రత్త, తడి చేతులతో ఇంట్లోని స్విచ్ బోర్డులను ముట్టుకోవద్దన్నారు. విద్యుత్ షాక్‌తో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, జాగ్రత్తగా వుండాలన్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త వహించాలని, ఏదైనా విద్యుత్ సమస్య వుంటే, తీగలు తెగి ఉన్నా పోల్స్ పడిపోయినా వెంటనే మీ లోకల్, లైన్ ఇన్‌స్పెక్టర్స్‌కు కానీ లైన్ మ్యాన్‌కు కానీ, సబ్ స్టేషన్స్‌కు కానీ, ఎఇ దృష్టికి కానీ, 1912 నెంబరుకు కానీ తెలపాలన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి: ఏఈ

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో 17 లే అవుట్ లలో నిర్మిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం ఆయన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాల్లో గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ కార్యదర్శులు హౌసింగ్ సిబ్బందితో ఇళ్ల నిర్మాణాలతో పాటు పలు అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో హౌసింగ్ పథకంలో 947 ఇల్లు మంజూరు కాగా అందులో కాలనీలో 722 ఇళ్లకు భూమి పూజ చేశారని 602 ఇళ్లు పూర్తి అయ్యాయని తెలిపారు. 120 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోని ఇళ్ల వద్ద వ్యక్తిగతంగా నిర్మించుకుంటున్నా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. వీరందరికీ సిమెంట్ తో పాటు బిల్లులను అందించారన్నారు. జగనన్న కాలనీలలో కల్పించిన మౌలిక వసతులపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. నిర్మాణాలను బట్టి వారికి బిల్లులను సిమెంటును చెల్లిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో త్రివిక్రమ్ రావు, సిబ్బంది యుగంధర్, దయాకర్ రెడ్డి పాల్గొన్నారు.

సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : మాజీ ఎంపీపీ, సింగల్ విండో ఛైర్మన్, సీనియర్ వైసీపీ నాయకులు సుదర్శన్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం నారాయణ వనంలోని వారి గృహంలో కుటుంబ సభ్యులతో. డిప్యూటీ సీఎం. కళాత్తూరు నారాయణ స్వామి, మంత్రి పెద్దిరెడ్డి, రామచంద్రారెడ్డి. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యులు సుమన్ కూమార్ కుటుంబ సభ్యులతో కలిసి సుదర్శన్ రెడ్డి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

పేదలకు సేవలు అందించడంలోనే సంతృప్తి

- జగనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మహేంద్ర రెడ్డి

ప్రజాశక్తి-గూడూరు టౌన్ : పేద ప్రజలకు సేవ చేయ డంలోనే సంతృప్తి వుందని జగనన్న సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, వైసిపి సీనియర్ నాయకులు ఊటుకూరు మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు మండల పరిధిలోని నెల్లూరు గిరిజన కాలనీలో 50 గిరిజన కుటుంబాలకు వారి వారి ఇంటి వద్దకు వెళ్లి తుపాను దృష్ట్యా వారి స్థితిగతులను తెలుసుకొని దుప్పట్లు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజలకు సేవ చేయాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని ఆదర్శంగా తీసుకొని జగనన్న సేవా సమితి పేరుతో ప్రజల సేవచేసేందుకు ముందుకు వచ్చామన్నారు. ఇందులో భాగంగా మండల ప్రాంతాలలో ప్రజలు వర్షాభావం చలితో ఇబ్బందులు పడు తున్న తరుణంలో మొదట గిరిజన కుటుంబాలకు దుప్పట్లు అందించడం సంతోషదా యక మన్నారు.

ఆలయ ప్రహరీ తొలగిస్తే సహించం.!

- ఆర్అండ్‌బీ అధికారులకు గ్రామస్తుల హెచ్చరిక

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: రోడ్డు నిర్మాణం పేరిట ఆలయ ప్రహరీ తొలగిస్తే సహించేది లేదని మండలంలోని గడ్డూరు గ్రామస్తులు అధికారులకు హితవు పలికారు. ఆదివారం వారు ఆలయం వద్ద స్థానిక విలేకరులతో మాట్లాడారు. బ్రిటీష్ కాలం నాటి సల్లాపురి గంగమ్మ ఆలయానికి దాతల సాకారంతో 1985లో ఆలయ నిర్మాణం, ప్రహరీ నిర్మాణం చేపట్టి విగ్రహ ప్రతిష్టాపన చేశామన్నారు. కాగా ఇప్పుడు బైరెడ్డిపల్లి-దాసరాపల్లి రహదారికి ఆలయం అడ్డుగా ఉందనే ఉద్దేశంతో అధికారులు ప్రహరీ తొలగించాలని చూస్తున్నారన్నారు. ప్రహరీ గోడను తొలగించాలని చూస్తే సహించేది లేదని, ఎట్టి పరిస్థితిలో గ్రామస్తులంతా ఏకమై అడ్డుకుంటామని హెచ్చరించారు. ఆలయానికి ఇబ్బంది కలగకుండా రోడ్డు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి అధికారులకు హితవు పలికారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, విజయమ్మ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ విజయం..

చిత్తూరులో శ్రేణుల సంబరాలు

చిత్తూరులో సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ నేతృత్వంలో చిత్తూరులో శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం స్థానిక గాంధీ విగ్రహం ఎదుట సంబరాలు జరుపుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ఆదరణ పెరుగుతోందన్నారు. కర్నాటక, తెలంగాణలో కాంగ్రెస్ విజయంతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు. రానున్న రోజుల్లో ఏపీలో తమ పార్టీ బలపడుతుందన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో దేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం సంతరించుకోనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రాణియాదవ్, పరదేశి, రామూర్తి, నారాయణస్వామితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో స్వీట్లు పంపిణీ

ప్రజాశక్తి-పెద్దపంజాణి: దేశంలో కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి మరే ప్రభుత్వం చేయలేదని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు దొరస్వామి అన్నారు. ఆదివారం మండలంలోని రాయలపేట గ్రామంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ బలపడనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శంకర్‌కుమార్, రాజన్న, వినాయక, సుబ్ర మణ్యం, వెంకటేష్, ఉమాపతి, సత్యప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

నగరిలో టపాకాయలు పేల్చి సంబరాలు

ప్రజాశక్తి-నగరి: తెలంగాణలో కాంగ్రెస్ విజయంతో నగరిలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక బస్టాండు ప్రాంగణంలో టపాకాయలు పేల్చి, స్వీట్లు పంపిపెట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు నటరాజ్ మొదలియార్, డీసీసీ సెక్రటరీలు ఢిల్లీ, దేశయ్య, చిరంజీవి రెడ్డి, రజనీ దేశప్ప, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో సామాన్యులపై ధరల భారం

- రాజధాని లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్
- ఇంటింటి ప్రచారంలో మాజీ మంత్రి అమరనాథ్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వంలో సామాన్యులపై ధరల భారం అధికంగా ఉందని మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి మండిపడ్డారు. ఆదివారం మండలంలోని కోగిలేరు పంచాయతీలోని బసవరాజుకండ్రిగ, కోగిలేరు, పొట్టగానిపల్లి, చీకలదిన్నెపల్లి, రాయలపేట పంచాయతీలోని దాసినంపల్లి, గుడిపల్లి, బాలేపల్లి, శెట్టివారిపల్లి, బాటిండ్లు, కొళత్తూరు పంచాయతీలోని గుత్తివారిపల్లిలో ఇంటింటి తెలుగుదేశం, బాబు షూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమయ్యారు. జోరు వానలోనూ మాజీ మంత్రికి ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమరనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాజధాని లేని రాష్ట్రంగా సీఎం జగన్ ఆంధ్రరాష్ట్రాన్ని అదోగతి పాలు చేశారని విమర్శించారు. ఆయన అసమర్థ పరిపాలన వల్ల గ్రామీణ ప్రాంతాల్లో నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుడు ఇబ్బంది పడటమే కాకుండా చదువుపూర్తి చేసుకున్న యువత నిరుద్యోగులుగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారని నిప్పులు చెరిగారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను స్థానికంగానే కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ విడుదల చేసిన మినీ మ్యానిఫెస్టోని ప్రజలకు వివరించారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మాజీ మంత్రి పర్యటనలో భాగంగా బసవరాజుకండ్రిక, కోగిలేరుకు చెందిన పలువురు వైసీపీ నాయకులు బసవరాజ, సుబ్రహ్మణ్యం, కోగిలేరులో వెంకటరమణ, సుబ్రహ్మణ్యం తదితరులు మాజీ మంత్రి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆనంద్‌కుమార్, చలపతి, భానుప్రతాప్‌రెడ్డి, జనసేన నాయకులు దిలీప్, నాగరాజ, శివ, రమేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డులో..గుండెలు ఆగిపోతున్నాయి!

- పట్టని ఆర్అండ్‌బి అధికారులు
- ప్రమాదాల నిలయంగా పచ్చికాపలం రోడ్డు

ప్రజాశక్తి రామచంద్రాపురం: ఆ రోడ్లో ప్రయాణం చేయాలంటే గుండెలు ఆగిపోతాయి. ప్రాణాలు పోగొట్టుకోవాల్సిందేనని వా హనచోదకులు ప్రాణాల చేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నారు. ఆ రోడ్డు ఎక్కడో కాదు తిరుపతి-పచ్చికాపలం (వయా రామచంద్రాపురం) రోడ్డు ఈ మార్గంలో ప్రయాణించే టిప్పర్లు. లారీలు, ట్రాక్టర్లు టన్నులకొద్దీ కంకర, మట్టి, ఇసుక, కాసి రాళ్లు (పునాదిరాళ్లు) లోటు వేసుకుని నడుపుతున్నారు. దీంతో ఆ రోడ్డు పూర్తిగా గుంతల మయం అయ్యింది.

రామచంద్రపురం మండలం, సి. రామాపురం గ్రామ ప్రవేశములో బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందున్న రహదారిపై భారీగా గుంతలో ఏర్పడడంతో రెండు రోజుల క్రితం ఓ ఆటో బోల్తా పడింది. దీంతో వాహనం స్వల్పంగా దెబ్బతిన్నది. ఆటోలో రవాణా చేస్తున్న వస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి.

కార్వేటి నగరం, వెదురు కుప్పం మండలాల ప్రాంతాలైన పచ్చికాపలం, గాదంకి, బ్రాహ్మణపల్లి ప్రాంతాల నుంచి టిప్పర్లు, లారీలు కంకరు లోడ్ చేసుకుని అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ఇటీవల రాయలచెరువు పేట వద్ద ప్రమాదానికి గురై నవ వధువు మృతి చెందడం జరిగింది. తిరుపతి- పచ్చికాపలం రోడ్డు ఎక్కువ గుంతల మయం కావడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

గుంతల మయమైన ఈ రహదారిని మరమ్మతు చేయడానికి రోడ్లు భవనాల శాఖ అధికారులు కనీసం పట్టించుకోవడంలేదని, ఈ గుంతల రోడ్డులో ఎలా వాహనాలలో ప్రయాణం చేయాలో అర్థం కాక వాహన చోదకులు నానా కష్టాలు పడుతున్నారు. ఇకనైనా ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక నియోజకవర్గ ప్రజా ప్రతినిధి స్పందించి రోడ్లను మరమ్మతులు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా రవాణా సౌకర్యాలు బాగుండాలి. కానీ తిరుపతికి అతి సమీపంలో ఉన్న తిరుపతి - పచ్చికాపలం రోడ్డు భారీగా గుంతల మయం కావడంతో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డు మార్గంలో వాహన చోదకులు ప్రయాణించాలంటే ప్రాణాలను గుండెల్లో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోంది. రాయల చెరువు - అనుపల్లి రహదారి పూర్తిగా గుంతలమయమైపోయి ప్రయాణించడానికి చాలా కష్టంగా ఉన్నదని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ రోడ్డు మార్గాలను ప్రభుత్వం మరమ్మతు చేయలేకపోయినా కనీసం స్థానిక ప్రజలు, పోలీసులు, విద్యార్థులు శ్రమదానంతో రోడ్డులోని గొంతులను మట్టితో పూడ్చి మరమ్మ తులు చేస్తే బాగుంటుందని చాలామంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శ్రమదానం ద్వారా మన రోడ్లను మనం బాగు చేసుకుందాం..మన ప్రాణాలను కాపాడుకుందాం... అంటూ కొన్ని గ్రామాల ప్రజలు పిలుపునిస్తున్నారు.

పాలకులు రోడ్ల అభివృద్ధిపై పట్టించుకోకపోవడంతో 'మా రోడ్లకు ఇదేమి ఖర్మ' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తూ గుంతల మయమైన రోడ్లలో వాహన చోదకులు ప్రయాణం చేస్తున్నారు. ఈ రోడ్డు మార్గంలో గతంలో ప్రయాణం చేయడం చాలా సులభతరంగా ఉండేది. ఇప్పుడు ప్రయాణం చేయాలంటే గంటల కొద్ది సమయం పడు తోందని, వాహనాలు కూడా రిపేర్లకు గురవుతున్నాయని వాహన చోటుకుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో వర్షపు నీరు నిలచిపోవడంతో వాహన చోదకులకు గుంతలు తెలియక వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రోడ్డు మార్గంలో ప్రయాణిస్తున్న వాహన చోదకులు ఈ రోడ్డు మార్గంలో గుంతలను పూడ్చి మా ప్రాణాలను కాపాడండి మహా ప్రభువు అంటూ అటు ప్రభుత్వాన్ని, అధికారులను, ఇటు ప్రజాప్రతి నిధులను వేడుకుంటున్నారు. ఇకనైనా నియోజకవర్గ ప్రజా ప్రతినిధి, ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్లను మరమ్మతు చేయించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారులు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలి: తహశీల్దారు

పజాశక్తి -తొట్టంబేడు: తుపాను ప్రభావం ఎక్కువగా ఉంది లోతట్టు ప్రాంతంలో ఉన్న మండల ప్రజలు జాగ్రత్తగా ఉండా లన్నారు. ఆయా గ్రామాలకు సంబంధించిన అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచార అందించా లని ఎంపీడీవో సుధీర్‌రెడ్డి అన్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను సురక్షితమైన ప్రాంతాలకు తరలించాలన్నారు. చిట్టత్తూరు వద్ద ఉన్న కాజు వేను, కార కొల్లు వద్దనున్న కాజు వే పరిశీలించి ఆ మార్గాన వాహనాలు వెళ్లకుండా వాహనదారులకు సూచించారు.అనంతరం రోడ్డు కు అడ్డంగా చెట్లు కొట్టేసి టాక్టర్ ట్రక్కును అడ్డంగా పెట్టించారు. సిఐ విక్రం మండల ప్రజలు జాగ్రత్త గా ఉండాలన్నారు. వాగులు వంకల దగ్గర ప్రయా ణికులకు ఇబ్బందుల కలగకుండా ఉండాలని పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి వాహన దారులు ఆ మార్గానా వెళ్లకుండా వారికి నీటి ఉధృత ఎక్కువగా ఉందని తెలియజేశారు. కొత్త కండ్రిగ అంగన్వాడి కేంద్రం నీట మునిగింది. అంగన్వాడీ కేంద్రానికి విద్యార్థులు వెళ్లాలంటే నానా అవస్థలు పడాల్సిందే.. పిచ్చటూరు శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డు మార్గానికి ఆనుకొని పాఠశాల భవనం ఉంది. అంగన్వాడి కేంద్రం రోడ్డు కంటే కిందకు ఉండడంతో నీళ్లు చేరాయి. పిచ్చటూరు- శ్రీకాళహస్తి రోడ్డు మార్గంలో కొత్త కండిగ వద్ద కల్వర్టు ను అడ్డగించి ఓ రైతు మట్టితో లేసాడు వర్షాకాలం వస్తే ఆ కల్వర్టు నుంచి నీరు నేరుగా రోడ్డుపైకి వచ్చే ప్రయాణి కులకు ఇబ్బందిగా మారుతోంది. ఈ కార్యమంలో ప్రజలు పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL. SENIOR CIVIL JUDGE OF CHITTOOR
I.P.No. 42 of 2021

Between:
V.S.Raju ...Petitioner
And:
S.Sreenivasulu Naidu and another ...Respondent

SUMMONS TO THE 1ST RESPONDENT

To
S.Sreenivasulu Naidu
S/o Late Narasimhulu Naidu,
Hindu,Aged about 45 years
R/at Bandvallavuru Village,
Madhavaram Post,Yadamari Mandal,
Chittoor District.

Sir, Please take notice that the above named petitioner filed the above I.P against you and one another for cancel the collusive,nominal and fradulent sale deed dated 29-09-2021 and other reliefs and the above I.P is posted for your appearance before the said court on 29-12-2023. Please be present on the said date before the said court at about 10-30 AM either in person or through an advocate and to raise objections,if any, failing which the matter will be decided expate in your absence.

Sd/-K.SATHYA MOORTHY
Advocate,Chittoor
Place : Chittoor Date: 30-11-2023